సాక్షి
తూర్పుగోదావరి


ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



స్వామి ఊరేగె.. మది ఉప్పొంగె

అంతర్వేది దివ్యక్షేత్రంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనృసింహ స్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.

8లో



లక్ష్మీప్రదం.. నారసింహుని ఆలయం

కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు గ్రామంలో కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి పనులకు చినజీయర్ స్వామి శ్రీకారం చుట్టనున్నారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు షురూ



విధుల్లో చేరి బోధనాసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసిన సూపర్ స్పెషాలిటీ వైద్యులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో మూడు ఉచిత సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకుని వచ్చింది. బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ నేతృత్వంలో ఈ వైద్య బృందాలు సేవలు అందించనున్నాయి. సర్జికల్ అంకాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగ వెంకట సమ్మెరాజా, న్యూరాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్‌పీఎస్‌ఎస్ సాయిసీలిమ, న్యూరో సర్జరీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్‌బాబు, డాక్టర్ పాతూరి కిశోర్‌లను ప్రభుత్వం నియమించింది. వీరు బోధనాసుపత్రిలో పూర్తి సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందించనున్నారు. రోజు విడిచి రోజు ఔట్‌పేషెంట్ (ఓపీ) సేవలు అందించనున్నారు. ఒక రోజు ఓపీ, ఒక రోజు వార్డుల్లో వైద్య సేవలు అందిస్తారు. సర్జికల్ అంకాలజీ ఓపీ సోమ, బుధ, శుక్రవారాల్లోను, న్యూరాలజీ, న్యూరో సర్జరీ ఓపీ మంగళ, గురు, శనివారాల్లో చూస్తారు. త్వరలో యూరాలజీ, ఇతర సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు కూడా అందుబాటులోకి తీసుకు రానున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రభ తెలిపారు. ఇప్పటి వరకూ ఈ ఆసుపత్రిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నగర శాఖ ఆధ్వర్యాన ప్రైవేటు వైద్యులు వారానికో విభాగం చొప్పున సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేవారు.

బ్యారేజీపై వాహనాలకు రైట్‌రైట్



పూర్తయిన ధవళేశ్వరం ఆర్మ్ రోడ్డు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావడంతో శనివారం నుంచి వాహనాలు రాకపోకలకు అనుమతించారు. ధవళేశ్వరం ఆర్మ్‌కు సంబంధించిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ రోడ్డు పనుల దృష్ట్యా ఈ నెల 1 నుంచి బ్యారేజీపై రాకపోకలను నిలిపివేశారు. సుమారు రూ.2 కోట్లతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తయ్యి, రాకపోకలకు అనుమతించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బ్యారేజీ రోడ్డుపై రాకపోకలు అనుమతించడంతో వాడపల్లి వెళ్లే భక్తులకు ప్రయాణ దూరం తగ్గనుంది.

53 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు



జేసీ తేజ్‌భరత్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని 53 కేంద్రాల్లో ఈ నెల 25న ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణపై సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలతో కలెక్టరేట్ నుంచి ఆయన శనివారం గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ పరీక్షలకు రాజమహేంద్రవరం డివిజన్‌లో 35, కొవ్వూరు డివిజన్‌లో 18 కేంద్రాలు కేటాయించామన్నారు. పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 18,501 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులు గంట ముందుగా ఆయా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందని చెప్పారు. పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్లు, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ పరీక్షలకు ఆయా కళాశాలల యాజమాన్యాలు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా, పోలీసు బందోబస్తు, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య శిబిరాల వంటి అంశాలపై సంబంధిత అధికారులకు జేసీ తేజ్‌భరత్ దిశానిర్దేశం చేశారు.

అతివకు చేయూత

- ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం తోడ్పాటు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున సాయం
- వ్యాపార రంగంలో రాణిస్తున్న మహిళలు
- జిల్లాలో మూడు విడతల్లో రూ.473.31 కోట్ల పంపిణీ
- నాలుగో విడతలో 95,760 మందికి రూ.179.55 కోట్ల మేర లబ్ధి
- త్వరలో జమ చేయనున్న సీఎం జగన్



కూరగాయల వ్యాపారంతో జీవనోపాధి పొందుతున్న బత్తిన విజయ

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): మహిళల సమగ్రాభివృద్ధి, ఆర్థిక సాధికారతే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. ఇందులో ముఖ్యమైనది వైఎస్సార్ చేయూత. 2020 ఆగస్టు 12న ప్రారంభించిన ఈ పథకం కింద 45 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున అందజేస్తోంది. ఇలా నాలుగు దఫాల్లో రూ.75 వేల ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారు స్వశక్తిపై ఎదిగేందుకు, సుస్థిరమైన జీవనోపాధి పొందేందుకు తోడ్పాటునందిస్తోంది. వైఎస్సార్ చేయూత పథకం కింద ఇప్పటి వరకూ మూడు విడతల్లో జిల్లావ్యాప్తంగా అర్హులైన మహిళలకు ప్రభుత్వం రూ.473.31 కోట్ల మేర ఆర్థిక సాయం అందజేసింది. నాలుగో విడతగా ఈ సంవత్సరానికి గాను 95,760 మంది లబ్ధిదారుల ఖాతాల్లో మరో రూ.179.35 కోట్లు జమ చేయనుంది. మొత్తం నాలుగు విడతలూ కలిపి వైఎస్సార్ చేయూత కింద జిల్లావ్యాప్తంగా అర్హులైన మహిళలకు రూ.652.85 కోట్ల మేర లబ్ధి చేకూరుతోంది.

'చేయూత'నిస్తోందిలా..

- వైఎస్సార్ చేయూత పథకం కింద రిటైల్ వస్త్ర వ్యాపారంలో గుర్తింపు పొందిన లబ్ధిదారులకు తోడ్పాటునిచ్చేందుకు ప్రభుత్వం బహుళజాతి కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంది.
- పాడి రైతులకు పశువుల పెంపకం, పాల సేకరణ, కిరాణా షాపులు, వస్త్ర దుకాణాల ఏర్పాటు, పండ్లు, కూరగాయలు, చిన్న జీవాల కొనుగోలు వంటి వాటి కోసం ఆర్థిక సహాయం చేస్తోంది.
- జీవనోపాధి తరహా వ్యాపారాలు నిర్వహించేందుకు మహిళలకు అవకాశం కల్పించింది.
- తద్వారా లబ్ధిదారులు తమ కుటుంబ ఆదాయం పెంచుకోగలుగుతూ, సుస్థిర అభివృద్ధి సాధిస్తున్నారు.

వ్యాపారంలో పురోగతికి..

గడచిన మూడు విడతల్లో అందుకున్న లబ్ధితో మహిళలు వివిధ వ్యాపారాల్లో మరింత పురోగతి సాధించారు. తద్వారా కుటుంబానికి ఆర్థికంగా తమ వంతు ఆసరా అందిస్తున్నారు. గతంలో చిరు వ్యాపారాలు చేసేందుకు కూడా అప్పుల కోసం బయట తిరగాల్సి వచ్చేదని, ఎక్కువ వడ్డీలకు తీసుకోవాల్సి వచ్చేదని, నేడు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా తమ కాళ్లపై తాము నిలబడగలుగుతున్నామని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సంఘంలో తమకొక గుర్తింపు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నాలుగేళ్లుగా జిల్లాలో వైఎస్సార్ చేయూత లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
2020-21	75,096	140.81
2021-22	84,362	158.18
2022-23	92,970	174.32
2023-24	95,760	179.55

జిల్లా వ్యాప్తంగా నాలుగు విడతలు కలిపి రూ.652.85 కోట్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూర్చారు.

మూడు విడతల్లో రూ.56,250



వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మూడు విడతల్లో రూ.56,250 మేర లబ్ధి పొందాను. టిఫిన్ సెంటర్ పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నాను. గతంలో రోజు గడవడమే కష్టంగా ఉండేది. ఇప్పుడు టిఫిన్ సెంటర్ ద్వారా ప్రతి రోజూ ఆదాయం సంపాదించుకుంటున్నాను.

– వి.నారాయణమ్మ, రాజమహేంద్రవరం

బిర్యానీ పాయింట్‌తో...



వైఎస్సార్ చేయూత పథకం కింద ప్రభుత్వం అందించిన డబ్బులతో బిర్యానీ పాయింట్ పెట్టుకున్నాను. దీని ద్వారా నేను లబ్ధి పొందడమే కాకుండా కుటుంబ పోషణ కూడా చూసుకోగలుగుతున్నాను.

– ఎండీ అషమున్నిసా బేగం, రాజమహేంద్రవరం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా..



ప్రభుత్వం వైఎస్సార్ చేయూత ద్వారా ఇచ్చిన డబ్బులతో టైలరింగ్ యూనిట్ పెట్టుకున్నాను. నేను ఉపాధి పొందడమే కాకుండా మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నాను. మాలాంటి వారికి ఇంత మంచి చేసిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటా.

– జి.వరలక్ష్మి, రాజమహేంద్రవరం

మెరుగుపడుతున్న జీవనోపాధి



చేయూత పథకం నిరుపేద మహిళలకు వరం. లబ్ధిదారులు వస్త్ర, కిరాణా వ్యాపారాలు, పాడి పరిశ్రమల వంటివి ఏర్పాటు చేసుకుని లబ్ధి పొందుతున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. వారి జీవనోపాధి మెరుగుపడుతోంది.

– ఎస్‌వీఎస్ మూర్తి, డీఆర్‌డీఏ పీడీ

లైంగిక వేధింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): లైంగిక వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయస్థానం ఆవరణలో 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం -2013'పై శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నప్పటికీ, వివక్షకు, వేధింపులకు గురవుతున్నారన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించేందుకు ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సహోద్యోగులతో సోదర భావంతో మెలగాలని, వారిని ఇబ్బందికర పరిస్థితులకు గురి చేయరాదని అన్నారు. పని ప్రదేశాల్లో మహిళలతో మాత్రమే కాకుండా కార్యాలయాలకు వచ్చే వారితో కూడా గౌరవంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. లైంగిక వేధింపులపై చర్యలు తీసుకునేందుకు ప్రతి కార్యాలయంలో సంబంధిత అధికారులు, ఉద్యోగులు తదితరులతో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఉంటుందని తెలిపారు. పని ప్రదేశాల్లో మహిళలపై ఎటువంటి లైంగిక వేధింపులు ఎదురైనా వెంటనే ఈ కమిటీ దృష్టికి తీసుకుని రావాలని, విచారణ అనంతరం తగు చర్యలు తీసుకుంటామని సునీత చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి బి.పద్మ మాట్లాడుతూ, వేధింపులకు గురైన మహిళతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితులు కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మానసిక పరిస్థితి సరిగా లేని పక్షంలో ఆమె వైద్యుల సహాయంతో ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. వేధింపుల తీవ్రతను బట్టి వేధించిన వారిని విధుల నుంచి సైతం తొలగిస్తారని అన్నారు. ఈ సదస్సులో న్యాయస్థానాల్లో పని చేస్తున్న దాదాపు 200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- కాతేరులో 'స్వచ్ఛత – మనందరి బాధ్యత' నిర్వహణ



డ్రైనేజీని స్వయంగా శుభ్రపరుస్తున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలోని గ్రామాలు, నగరపాలక సంస్థ పరిధిలోని డివిజన్లలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపడతామని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కాతేరు గ్రామంలోని సుబ్బారావుపేట, హరిజనపేట ప్రాంతాల్లో శనివారం ఉదయం 'స్వచ్ఛత – మనందరి బాధ్యత' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయ కన్వీనర్లు, అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు లబ్ధిదారులకు ఏమేరకు అందుతున్నాయో ఆరా తీశారు. గ్రామంలో మురుగు నీటి పారుదల సరిగ్గా లేని డ్రైనేజీని స్వయంగా పారతో శుభ్రపరిచారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణకు గ్రామాలను కాలుష్య రహితంగా తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా అధికార యంత్రాంగం పని చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పేదల ఆర్థికాభివృద్ధి, వారి పిల్లల ఉన్నత చదువులే లక్ష్యంగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఆ తండ్రికి తగిన తనయుడిగా నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఆశయంతో, పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రాథమిక విద్య నుంచే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని అన్నారు. ప్రతి పేదకూ మంచి చేయాలనే ఆశయంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టి, ప్రజలకు వారి ఇంటి వద్దనే ప్రభుత్వ పాలన అందిస్తున్నారని చెప్పారు. తాను పాలకుడిగా కాక, ప్రజా సేవకుడిగా మాత్రమే రాజకీయాల్లోకి వచ్చానని మంత్రి స్పష్టం చేశారు. గత 15 సంవత్సరాలుగా రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని, ప్రతిపక్ష నాయకులు అభివృద్ధికి అవాంతరాలు సృష్టిస్తున్నారని చెప్పారు. వారికి విమర్శించడం తప్ప పేదలకు మంచి చేయాలని ఆలోచనే లేదని, అందువల్లనే నియోజకవర్గంలోని పేదలకు 55 వేల ఇళ్ల స్థలాల పట్టాలు అందించనివ్వకుండా అడ్డుకుంటున్నారని మంత్రి వేణు అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడు, కాతేరు సొసైటీ చైర్మన్ ఆచంట కళ్యాణ్, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- సమగ్ర నిర్వహణలో హెచ్‌ఎంలు కీలకం
- పాఠశాల విద్య ఆర్‌జేడీ నాగమణి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

రాజమహేంద్రవరం రూరల్: పేద విద్యార్థులకు నాణ్యమైన చదువును అందించడంలో ప్రభుత్వ పాఠశాలలు ముందుంటున్నాయని పాఠశాల విద్య కాకినాడ జోన్-2 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీ) జి.నాగమణి అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆల్కాట్‌తోటలోని సత్యసాయి గురుకులంలో శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాఠశాలల సమగ్ర నిర్వహణలో ప్రధానోపాధ్యాయులదే కీలక పాత్ర అని అన్నారు. నిత్యం తరగతులను, ఉపాధ్యాయుల పనితీరును పర్యవేక్షించాలని, నిర్దేశిత సమయానికి టీచర్లు సిలబస్ పూర్తి చేశారా, నోట్ బుక్స్ దిద్ది సంతకం చేశారా అనే విషయాలు పరిశీలించాలని సూచించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లను (ఐఎఫ్‌పీ) నిత్యం వినియోగించాలన్నారు. టోఫెల్‌పై నూరు శాతం దృష్టి సారించి, పరీక్షలు సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు కూడా వారి సబ్జెక్టులో కొన్ని తరగతులు బోధించాలని సూచించారు. 'ప్రవీణ్ ప్రకాష్.. ఫ్రమ్ ది డెస్క్ ఆఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ' 14వ ఎపిసోడ్ వరకూ అందరూ వీక్షించి, అవగాహన కల్పించుకోవాలని నాగమణి చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కె.వాసుదేవరావు మాట్లాడుతూ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమష్టి కృషితో జిల్లాలో విద్యా శాఖను అభివృద్ధి పథంలో నడిపిద్దామని అన్నారు. పాఠశాలల రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. నూరు శాతం హాజరు ప్రక్రియను ఉదయం 10.30 గంటల లోపు పూర్తి చేయాలని, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలలో అన్ని కార్యక్రమాలూ నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రాథమిక స్థాయిలో అభ్యాసన స్థాయి మెరుగుపరచాలని, అందుకోసం 8వ తరగతి వరకూ లిప్ కార్యక్రమం అమలు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ, ఏసీ లక్ష్మీకుమారి, కొవ్వూరు లగూడెం డివిజన్ డీవైఈఓ రామన్నదొర, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, జిల్లాలోని ఎంఈఓ-1, 2లు, 192 మంది హెచ్‌ఎంలు, సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ శ్యాంసుందర్, ప్రిన్సిపల్ గుర్రయ్య పాల్గొన్నారు. ఇటీవల డీఈఓగా బాధ్యతలు చేపట్టిన వాసుదేవరావును ప్రధానోపాధ్యాయుల సంఘం ఘనంగా సత్కరించింది.

రూరల్ సీటు నాదే

- అధినేతలు ఉమ్మడిగా ప్రకటిస్తారు
- ఎవరికి వారు ప్రకటించుకోవడం సరికాదు
- జనసేన నేత కందుల దుర్గేష్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): 'వచ్చే ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి నేనే పోటీ చేస్తా. ఈ సీటు నాకే ఇస్తానని పవన్ కల్యాణ్ ఇప్పటికే నాకు చెప్పారు. అయితే పొత్తులో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబుతో కలసి ఉమ్మడిగా ప్రకటిస్తారు. అప్పటి వరకూ ఎవరికి వారు ఈ టికెట్ తమదేనని ప్రకటించుకోవడం సరికాదు' అని జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక వేంకటేశ్వర నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విలేకర్లు అడిగిన ప్రశ్నలకు ఆయన పైవిధంగా స్పందించారు. 2007లో ఎమ్మెల్సీ అయినప్పటి నుంచీ రూరల్ నియోజకవర్గంతో తనకు అనుబంధం ఉందని, నియోజకవర్గాన్ని ఎక్కువ అభివృద్ధి చేశానని, గత ఎన్నికల్లో 43 వేల పైచిలుకు ఓట్లు వచ్చాయని అన్నారు. ఈ విషయాలన్నీ పవన్ కల్యాణ్‌కి తెలుసునని, అందుకే తనకు మాట ఇచ్చారని అన్నారు. బీజేపీ కూడా పొత్తులో కలిస్తే సీట్ల విషయాన్ని మూడు పార్టీలూ ఉమ్మడిగా ప్రకటిస్తాయని చెప్పారు. పవన్ కల్యాణ్ గోదావరి జిల్లాల పర్యటన నాలుగైదు రోజుల్లో ఉంటుందని ఆయన తెలిపారు.

- వైభవంగా అంతర్వేది ఉత్సవాలు
- గరుడ, పుష్పక వాహనాలపై ఉత్సవమూర్తుల ఊరేగింపు

స్వామి ఊరేగె.. మది ఉప్పొంగె

సఖినేటిపల్లి: నారసింహాయా నమో నమామి.. సదా స్మరామి అంటూ ప్రతి మదీ తన్మయత్వం చెందింది.. మనసారా స్మరించింది.. అంతర్వేదిలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహ స్వామివారి దివ్య తిరు కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు శనివారం సాయంత్రం గరుడ పుష్పక వాహనంపై, రాత్రి పుష్పక వాహనంపై స్వామి వారికి గ్రామోత్సవాలు అట్టహాసంగా జరిగాయి. వేదమూర్తయిన గరుడు స్వామివారి వాహనం. నిత్యం తనను సేవించే గరుడ వాహనంపై అధిరోహించి స్వామి గ్రామోత్సవానికి తరలివెళ్లారు. అలాగే తన హృదయమనే పుష్పకంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తానని చాటేందుకు స్వామి పుష్పక వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకలు ఆలయ అర్చకుల పర్యవేక్షణలో జరిగాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామ గోపాలరాజా బహద్దూర్, ప్రజాప్రతినిధులు, సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వామి ఆలయం.. తేజోమయం

లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద విద్యుద్దీపాల అలంకరణ ఆధ్యాత్మికత మరింత ఇనుమడింజేస్తుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన దేవతామూర్తుల ఫ్లెక్సీలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ప్రధానంగా అయోధ్య రాముడి ఫ్లెక్సీతో పాటు పశ్చిమ రాజగోపురం, ప్రధాన, ఉపాలయాల గోపురాలు విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్నాయి. పశ్చిమ రాజగోపురం నుంచి స్వామివారి దర్శనానికి వెళ్లే మార్గంలో షామియానాలతో ఏర్పాటు చేసిన కళాకృతులు ముచ్చట గొలుపుతున్నాయి.



అంతర్వేదిలో పుష్పక వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం

అంతర్వేదిలో నేడు

ఈ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవ, 5.30 నుంచి 7 గంటల వరకూ తిరువారాధన, బాలభోగం, అర్జిత అభిషేకం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు ఉంటాయి. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ శ్రీసుదర్శన హోమం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు హంస వాహనంపై, 6.30 గంటలకు ధూపసేవ అనంతరం ధ్వజారోహణ జరుగుతుంది. రాత్రి 8 గంటలకు శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

అలాగే ఆలయం లోపల క్యూలైన్లపై వేసిన షామియానాలు కూడా అందమైన డిజైన్లతో అలరిస్తున్నాయి.

లక్ష్మీప్రదం.. నారసింహుని ఆలయం

- దేవస్థానం అభివృద్ధికి నేడు శంకుస్థాపనలు
- త్రిదండి చినజీయర్ స్వామీజీచే అంకురార్పణ
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సారథ్యంతో పనులు



శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువు దీరిన కోరుకొండ

మధురపూడి: కోరుకొండ ఆధ్యాత్మికతకు నిలయం. ఆ లక్ష్మీనరసింహస్వామి కొలువైన ప్రాంతం.. స్వామివారి దేవస్థానానికి పూర్వ వైభవం తీసుకు రావాలనేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అభిమతం.. అందుకే పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఎన్నికల హామీలో భాగంగా ఆలయ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. దేవస్థానానికి మరింత శోభ తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. దేవస్థానంలో ఐదంతస్తుల రాజగోపురం, స్వామివారి ప్రధాన ఆలయానికి మెట్ల పైనుంచి భక్తులు సులభంగా చేరుకోవడానికి వీలుగా మెట్ల మార్గం నిర్మించనున్నారు. అలాగే దేవుని కోనేరును రూ.50 లక్షల రుడా నిధులతో అభివృద్ధి చేయనున్నారు. దీని చుట్టూ కూర్చుని తెప్పోత్సవాన్ని వీక్షించేలా 100 మీటర్ల పొడవున గ్యాలరీ, చుట్టూ మెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సమీపంలోని అగ్రహారంలో శ్రీరంగనాథ స్వామివారి ఆలయాన్ని టీడీడీ సహకారంతో రూ.2.10 కోట్లతో పునర్నిర్మించనున్నారు. అన్నవరం దేవస్థానం నిధులు రూ.60 లక్షలతో నారసింహుని ఆలయంలో మెట్ల మార్గానికి ఆదివారం త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి శంకుస్థాపన చేయనున్నారు. కోరుకొండ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ భాగస్వామ్యంతో రూ.3.80 కోట్ల నిధులతో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పథకాలకు సంబంధించిన పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సారథ్యంలో నిర్వహించనున్నారు.


సకాలంలో స్పందించేందుకు..

రాజానగరం నియోజకవర్గంలో వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉంది. అయితే అనుకోని ఘటనల్లో అగ్ని ప్రమాదాలు సంభవించి పంటలు కాలిపోయేవి. కుప్పలుగా వేసి ధాన్యం కాలిబూడిదయ్యేది. ప్రమాదాలను సకాలంలో నిలువరించేందుకు వీలుగా రూ.80 లక్షలతో కాపవరం ఎంపీడీఓ కార్యాలయ పరిసరాల్లో నిర్మించిన అగ్నిమాపక కేంద్రాన్ని కూడా ఆదివారం ప్రారంభించనున్నారు.

ఐదేళ్లలో జరిగిన పనులివీ..

కోరుకొండ బస్టాండ్ సెంటర్ నుంచి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం వరకూ రథం రోడ్డును రూ.కోటితో నిర్మించారు. దీనివల్ల స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవాల సమయంలో ప్రమాదాలను నివారించారు. కొండ చుట్టూ తిరిగే గిరి ప్రదక్షిణ భక్తులకు వీలుగా రోడ్డును రూ.20 లక్షలతో అభివృద్ధి చేశారు. స్వామివారి తెప్పోత్సవం సందర్భంగా ఎలాంటి ఇబ్బంది రాకుండా నాణ్యమైన పంటును సమకూర్చారు.


ఆ స్వామికి సేవకుడిలా..



శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి పురాతన చరిత్ర ఉంది. ఆ స్వామివారి కృపతోనే ఎమ్మెల్యే అయ్యాను. నా తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు స్ఫూర్తితో ప్రజా సేవ చేస్తున్నా. కోరుకొండలో రూ.9.40 కోట్లతో అభివృద్ధి పనులు చేశాను. ఆదివారం రూ.3.80 కోట్లతో మరిన్ని పనులకు శంకుస్థాపనలు చేస్తాం. దేవస్థానాన్ని మరింత ప్రగతి పథాన తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తా.

–జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

ఆలయ పునర్నిర్మాణం అద్భుత ఘట్టం



కోరుకొండలో రూ.2.10 కోట్లతో పురాతన శ్రీరంగనాథ స్వామి ఆలయ పునర్నిర్మాణం చేపట్టనుండటం అద్భుత ఘట్టం. 1930 దశకంలో నిర్మించిన ఆలయంలో స్వామివారి విగ్రహం నిలుచుని ఉండడం ఇక్కడ ప్రత్యేకత. అలాగే లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో రాజగోపురం, మెట్ల నిర్మాణం తదితర పనులకు త్రిదండి చినజీయర్ స్వామి రావడం ఇక్కడి ప్రజల అదృష్టం. దీనికి సహకరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు.

–తాడి రజనీరెడ్డి, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.